# శాంతి భద్రతల్లో తెలంగాణ టాప్

*బోయిగూడలో నిర్వహించిన సమావేశంలో మంత్రి తలసాని యాదవ్*

బన్సీలాల్‌పేట్, నవంబర్ 23: శాంతి భద్రతల నిర్వహణలో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని సనత్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. జమాతుల్ ఖురేషి, సికింద్రాబాద్ (మేకలు, గొర్రెల విక్రయదారుల సామాజిక సేవా సంఘం) ఆధ్వర్యంలో బోయిగూడలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణలో హిందూ, ముస్లీం, క్రిస్టియన్, సిక్కు మతాలను, నార్త్ ఇండియన్స్‌ను సమానంగా గౌరవిస్తున్న ఏకైక సెక్యులర్ సీఎం కేసీఆర్ అని, హైదరాబాద్ మహా నగరంలో గంగా జమునా తెహజీబ్ సంస్కృతి విరాజిల్లుతున్నదని ఆయన అన్నారు. కరెంట్ కోతలు లేకుండా పరిశ్రమలు అద్భుతంగా నడుస్తున్నాయని, పేద ప్రజలకు 20 వేల లీటర్ల తాగునీరు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ముస్లింల సంక్షేమం, అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నదని అన్నారు. మళ్ళీ మన ప్రభుత్వం ఏర్పడగానే సంక్షేమం, అభివృద్ధి పనులు మరింత వేగంగా కొనసాగుతాయని ఆయన తెలిపారు. ఆడబిడ్డ వివాహానికి శాదీ ముబారక్ పథకం ద్వారా ఇప్పటి వరకు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించారని, ఎన్నికల అనంతరం దానిని రెండు లక్షలకు పెంచుతున్నామని తెలిపారు. తెలంగాణాలో మైనార్టీ విద్యార్థుల కోసం అత్యధిక రెసిడెన్షియల్ స్కూళ్ళు, కాలేజీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తొమ్మిదిన్నరేండ్లలో తెలంగాణకు ఏమి చేయలేదన్నారు. కుల, మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ది పొందేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.



బోయిగూడలో జమాతుల్ ఖురేషి, సికింద్రాబాద్ సమావేశంలో మాట్లాడిన మంత్రి తలసాని



## రేపు పరేడ్ గ్రౌండ్స్‌లో సీఎం కేసీఆర్ బహిరంగ సభ

*ఏర్పాట్లు వేగవంతం కవాలి: తలసాని - పనులను పరిశీలించిన ఎమ్మెల్సీ రాజు*

సిటీబ్యూరో, నవంబరు 23(నమస్తే తెలంగాణ): ఈ నెల 25వ తేదీన జరిగే ముఖ్యమంత్రి కేసీఆర్ సభ ఏర్పాట్లను వేగవంతం చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సభ నిర్వాహకులను ఆదేశించారు. గురువారం సాయంత్రం టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లుతో కలిసి సభా వేదిక నిర్మాణం, బారికేడ్‌ల ఏర్పాట్లను తలసాని పరిశీలించారు. బహిరంగ సభకు ఒక్క రోజే ఉన్నందున పనులను వేగంగా చేపట్టాలని తలసాని సూచించారు. సభా వేదిక ఏర్పాటు, సభా ప్రాంగణంలోకి వచ్చే వారు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. 24 నియోజకవర్గాల నుంచి వచ్చే పార్టీ శ్రేణుల వాహనాల పార్కింగ్‌కు 24 ప్రాంతాలను గుర్తించామని, అక్కడ కూడా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో సభకు వచ్చే గులాబీ శ్రేణులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని మంత్రి తలసాని చెప్పారు. సభ ఏర్పాట్లను ప్రభుత్వ విప్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, గజ్జెల నగేష్ తదితరులు పరిశీలించారు.



## జోరుగా బీఆర్‌ఎస్‌లోకి చేరికలు

*ఎమ్మెల్యే గోపీనాథ్ సమక్షంలో కారెక్కిన 100 మంది మైనార్టీలు.*

ఎర్రగడ్డ, నవంబర్ 23: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌లోకి చేరికల పరంపర కొనసాగుతున్నది. తాజాగా ఎర్రగడ్డ డివిజన్ నుంచి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ సమక్షంలో ఎంఐఎం పార్టీకి చెందిన 100 మందికి పైగా మైనార్టీలు కారెక్కారు. వారందరికీ గులాబీ కండువాలు వేసి గోపీనాథ్ పార్టీలోకి ఆహ్వానించారు. డివిజన్‌లోని న్యూ సుల్తాన్‌నగర్ నుంచి 50 మంది, నేతాజీనగర్ నుంచి మరో 50 మంది చొప్పున పార్టీలో చేరటం జరిగింది. నేతాజీనగర్‌లో మాగంటికి మహిళలు సహా స్థానికులు ఘన స్వాగతం పలికారు. యువకులు గజమాలతో స్వాగతం పలికి సన్మానం చేశారు. పార్టీలో చేరిన వారిని ఉద్దేశించి మాగంటి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సుపరిపాలన పట్ల ఆకర్షితులై అన్ని వర్గాల ప్రజలు బీఆర్‌ఎస్‌కు మద్దతు పలుకుతున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రి కావటం ఖాయమని, బీఆర్‌ఎస్ హయాంలోనే తెలంగాణ ముఖ చిత్రం పూర్తి స్థాయిలో మారిందన్నారు. ఇక జూబ్లీహిల్స్ తనకు అండగా నిలుస్తున్న నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో డివిజన్ అధ్యక్షుడు సంజీవ, ప్రధాన కార్యదర్శి షరీఫ్ ఖురేషీ, జావిద్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.




## బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

*బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి*



మన్సూరాబాద్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజలను కారు గుర్తుకు ఓటువేయాలని కోరుతున్న ఎల్బీనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, నవంబర్ 23: అభివృద్ధి సంక్షేమం కొనసాగాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ కాలనీల్లో బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం, లింగోజిగూడ డివిజన్‌లో కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు ప్రతిపక్షాలను నమ్మి మోసపోవొద్దని అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీలకు చెప్పుకోవడానికి ఏమీ లేదన్నారు. గుంపులుగా వస్తున్న ప్రతిపక్ష పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అద్భుతమైన ప్రగతి సాధించిందన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని ప్రతి గల్లీ తనకు తెలుసునని, ఏ సమస్యలున్నా, తాము పరిష్కరిస్తామన్నారు. మాయ మాటలు చెప్పే వారిని నమ్మొద్దని, ప్రజా సేవలో ముందుకు సాగుతున్న వారిని గెలిపించాలన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎల్బీనగర్ నియోకవర్గంలో బీఆర్‌ఎస్ జండాను ఎగురవేస్తామన్నారు. కాలనీల్లో అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తామన్నారు.

## కాంగ్రెస్, బీజేపీలు ప్రజలకు చేసిందేమీ లేదు

*ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు*

అల్లాపూర్, అక్టోబర్ 31: కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్రానికి చేసిందేమీ లేదని, ఆ రెండు పార్టీలు రాష్ట్రానికి చేటు అని కూకట్‌పల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని చంద్ర గార్డెన్స్‌లో డివిజన్ కార్పొరేటర్ సబీహాబేగం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ఆత్మీయ, బూత్ స్థాయి సమావేశానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తొమ్మిదేండ్ల క్రితం అల్లాపూర్‌లో ఏటు చూసినా మట్టి రోడ్లు, ఎక్కడికక్కడ మ్యాన్‌హోల్స్ పొంగి మురుగు కంపుతో ప్రజలు సమస్యలతో కొట్టు మిట్టాడేవారన్నారు. ఇక మహిళలు తాగు నీటి సమస్యతో ఖాళీ బిందెలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత సీఎం కేసీఆర్ మంత్రి కేసీఆర్ సహకారంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ రూ.కోట్ల నిధులు వెచ్చించి రిజర్వాయర్ నిర్మించి ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తున్నామని పేర్కొన్నారు. రూ.కోట్ల నిధులు వేచించి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్, కమ్యూనిటీ హాళ్లు, ఇండోర్ స్టేడియంలు, మినీ ఫంక్షన్ హాళ్ల నిర్మాణం, పార్కులను అభివృద్ధి చేసి ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దామన్నారు. గతంలో చిన్నపాటి వర్షానికే బస్తీలు, కాలనీలు నీట మునిగేవని, ముంపు సమస్యను శాశ్వతంగా అధిగమించేందుకు రూ.17 కోట్లతో నాలాల అభివృద్ధి చేపట్టామన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కూకట్‌పల్లి నుంచి మూడోసారి బరిలో ఉన్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గౌసుద్దీన్, ఐలయ్య, తిరుపతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

## అవినీతిపై బీజేపీ అభ్యర్థి మాట్లాడటం విడ్డూరం

*అంబర్‌పేట బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేశ్*



అంబర్‌పేట, నవంబర్ 23: అవినీతిపై బీజేపీ అభ్యర్థి సి.కృష్ణయాదవ్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని అంబర్‌పేట బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేశ్ అన్నారు. దేశద్రోహం కేసు, తెల్గీ స్కాంలో మూడున్నరేండ్లు జైలుకు వెళ్లి వచ్చిన అతను అవినీతి అంటూ మాట్లాడటం హాస్యాస్పదమని చెప్పారు. బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మా వెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ కె.పద్మావతి డీపీ రెడ్డిల ఆధ్వర్యంలో దిలీప్‌రాజ్ నాయకత్వంలో 500 మంది యువత ఎమ్మెల్యే వెంకటేశ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారందరికి వెంకటేశ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాలేరు మాట్లాడుతూ, బీజేపీ అభ్యర్థి స్కాంలో ఇరుక్కున్నారని, కాంగ్రెస్ అభ్యర్థిపై నాలుగు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, అందులో మూడు భూకబ్జా కేసులున్నాయని చెప్పారు. ఖైరతాబాద్‌కు చెందిన వ్యక్తి అంబర్‌పేటలో భూకబ్జా చేద్దామని వచ్చారా? అని ప్రశ్నించారు. ఎక్కడకు వెళ్లినా స్పందన వస్తుందని, అంబర్‌పేటలో భారీ మెజార్టీ ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.